# విపశ్యన మాసపత్రిక

సంపుటి 1 సంచిక 10 జనవరి 1, 2007

*(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగుమాస పత్రిక)*

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్, వనస్థలిపురం, హైదరాబాదు - 70

## "ధర్మవాణి"

*ఫుట్ఠస్స లోకధమ్మేహి, చిత్తం యస్స న కమ్పతి ।*
*అసోకం విరజం ఖేమం, ఏతం మఙ్గలముత్తమం ॥*

*..... మఙ్గలసుత్త.*

లాభనష్టాలు, కీర్త్యాపకీర్తులు, నిందాస్తుతులు, సుఖదుఃఖాలు - ఈ లోకధర్మాల స్పర్శతో చిత్తం చలించకుండా, నిశ్శోకంగా, నిర్మలంగా, నిర్భయంగా ఉండటం ఉత్తమమైన మంగళము.

## ధర్మబంధువుకు వీడ్కోలు

*(పూజ్యగురూజీ శ్రీ సత్యనారాయణ గోయెంకాజీ విపశ్యన ఆచార్యులు డాక్టర్ ఓం ప్రకాష్‌గారి (1912-1998) గురించి వ్రాసిన దానికి తెలుగు అనువాదము)*

"ఎంత అసాధారణం!" తనదైన మెత్తని స్వరంతో డా॥ ఓంప్రకాష్ గారు అన్నారు - "ఇది నిజంగా అసాధారణం. చాలామంది చనిపోవటం చూశాను గాని, ఇలాంటి దెక్కడా చూడలేదు." ఆయన నా పెద్దమ్మ మరియు దత్తత తల్లి అయిన శ్రీమతి రామిదేవిగారి గురించి చెప్తున్నారు. నిజంగా ఆమె వ్యాధి, ఆమె మరణం కూడ అసాధారణమైనవి. 75 సంవత్సరముల వయసులో, ఆమె మరణమునకు షుమారు 15 రోజుల ముందు, ఆమె ఇలాయచీదేవి (గోయెంకాగారి సతీమణి)తో మాట్లాడుతూ, మాటల సందర్భములో తనకు కొద్ది నెలలుగా పొట్టలో నొప్పి వస్తున్నట్టు చెప్పారు. ఆమె దానిని ఓర్చుకొని సమతలో ఉండగల్గుతున్నారు. ఏదో మాటల సందర్భములో చెప్పారంతే. మా డాక్టరు గారు, నా ఆప్తమిత్రుడు, మా కుటుంబములో ఒక వ్యక్తిగా కలసిపోయిన డా॥ ఓంప్రకాష్ గారికి కబురు చేశాను. ఆయన మా అమ్మగారిని పరీక్షించి, నన్ను ప్రక్కకు తీసుకెళ్ళి ఇలా అన్నారు, "ఇది బహుశా లీవర్ క్యాన్సర్ అయి ఉండవచ్చు. ఇలాంటి జబ్బులలో భరించలేనంత నొప్పి ఉంటుంది. రోగి అరుస్తూ, ఏడుస్తూ ఉంటాడు. ఈ ఒక్క విషయము తప్ప మిగతా లక్షణాలన్నీ ఈ వ్యాధినే నిర్ధారిస్తున్నాయి. నెలల తరబడి ఈ జబ్బును ఓర్చుకొంటూ, ఇతరుల కెవరికి చెప్పకుండా ఉండటం ఎవరికీ సాధ్యం కాదు. ఇప్పుడు కూడా మీ అమ్మగారు చాలా ప్రశాంతంగా ఉన్నారు. నేను ఇంకా పరీక్షలు చేయవలసి ఉంది."

రెండు రోజుల తరువాత డా॥ ఓంప్రకాష్‌గారు రంగూన్‌లో ప్రసిద్ధులైన కల్నల్ డా॥మీన్‌సేన్ గారిని వెంటపెట్టుకొని వచ్చారు. మా అమ్మగారిని పరీక్షచేసిన తరువాత ఆయన కూడా అదే అన్నారు. "లక్షణాలన్నీ ముదిరిన కేన్సర్ వ్యాధినే సూచిస్తున్నాయి. కాని రోగి చాలా ప్రశాంతంగా ఉన్నారు. దుఃఖము లేకుండా ఉన్నారు. ఆమె కేన్సర్‌తో బాధపడుతున్నారని నమ్మటం కష్టం. రోగనిర్ధారణ చేయటానికి మేము మరికొన్ని పరీక్షలు చేయాలి"

వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత ఇలాయిచీదేవి అమ్మను ఇలా అడిగింది. "మీకు ఎలాంటి నొప్పి వస్తున్నది"? ఆమె సమాధానం అందరిని ఆశ్చర్యపరిచింది. అమ్మ ఇలా చెప్పింది," ప్రసవ సమయములో కలిగే బాధాకరమైన నొప్పుల కంటే చాలా తీవ్రంగా ఉంది. కాని అరచి ఏడవటం వలన ఏమి ఉపయోగము? నేను ఆ నొప్పిని సమతాభావముతో గమనిస్తున్నాను. గురూజీ సయాజి ఊ బా ఖిన్ గారు మనకు నేర్పించింది ఇదే కదా!"

అమ్మ చాలా విశిష్టమైన విపస్సనా ధ్యాని. నా పూజ్య గురూజి గారి ధ్యాన కేంద్రములో ప్రతి నెల ఒక శిబిరమే జరుగుతుండేది. నెలలో మొదటి శుక్రవారము మొదలయ్యేది. సుమారు ఆరు, ఏడు సంవత్సరాల క్రిందట ఆమె విపశ్యనా మార్గములో నడవడం మొదలు పెట్టాక, ఆమె పాలుపంచుకోని శిబిరము ఒక్కటి కూడా లేదు. మొన్నీమధ్యనే ఆమె ఒక ప్రత్యేక 30 రోజుల శిబిరం పూర్తి చేశారు. ఆమె సమత ఎంతగా స్థిరపడిందంటే ఆమె దుఃఖముతో విలవిలలాడే అవకాశమే లేదు.

చాలా పరీక్షలు చేసిన తరువాత, డాక్టర్లిద్దరూ కూడా అది ఖచ్చితముగా కేన్సరేనని, అది ముదిరిపోయి చివరి దశకు వచ్చేసిందని నిర్ణయించారు. అమ్మ ఇక కొన్ని రోజులు మాత్రమే బ్రతుకుతుందని వాళ్లు అనుకొన్నారు. ఏవిధమైన చికిత్స అయినా ఉపయోగము ఉండదు, పైగా బాధను పెంచుతుంది. అయినప్పటికీ వాళ్ళు ఉపశమన చికిత్స చేసారు.

ఆమె చనిపోయే రోజున తెల్లవారు జామున మూడు గంటలకు నర్సుతో తన మరణ సమయం ఆసన్నమైనదని చెప్పి, తన పిల్లల్ని పిలవమని చెప్పారు. మేమందరమూ ఆమె గదికి వెళ్ళాము. నేను వెంటనే డా॥ ఓంప్రకాశ్‌గార్కి ఫోన్ చేసాను. ఆయనింకా నిద్రపోలేదు, ఎందుకంటే రెండు గంటల ముందరే చావు బతుకులలో ఉన్న వేరొక రోగిని చూడటానికి ఆయన వెళ్ళారు. అయినప్పటికి ఆయన వెంటనే వచ్చారు. నేను పూజ్య గురూజీ సాయాజి ఊ బా ఖిన్ గార్ని కూడా పిలిచాను. అదృష్టవశాత్తు, ఆయన కూడా మాతాజి సాయమగారితో కలసి వచ్చారు.

డాక్టర్ ఓంప్రకాశ్ గారు పరీక్షించారు గాని నాడి అందలేదు. అమ్మకు కొన్ని నిమిషములు మాత్రము ఉంది. ఆమె మరణానికి కొద్ది

క్షణాలు ముందు, "నేను లేచి కూర్చోవాలనుకొంటున్నాను" అని అన్నారు. "ఆమె పడుకొని ఉండటమే మంచిది. లేచి కూర్చుంటే నొప్పి ఎక్కువవుతుంది" అంటూ డా॥ ఓంప్రకాష్‌గారు వద్దన్నారు. కాని అమ్మ పట్టుపట్టారు. ఇది ఆమె ఆఖరు కోరికగా అర్థం చేసుకుని, నేను అమ్మనే సమర్థించాను. మేము ఆశ్చర్యపోయేటట్లుగా, ఆమె లేచి కాళ్ళు ముడుచుకొని కూర్చుని ధ్యానం చేయటం మొదలు పెట్టారు. నిజంగా ఇది కదా చెప్పుకోదగ్గ ధర్మము యొక్క శక్తి!

కొద్ది క్షణముల క్రితమే ఆమె నాడి అందలేదు. ఇప్పుడు కూర్చొని ధ్యానము చేస్తున్నారు. ధ్యానములో ఆమె నిశ్చయాన్ని మరింత దృఢ పరుచుటకు నేను, "తాయీమా! అనైస, అనైస - (పెద్దమా! అనిచ్చ, అనిచ్చ)" అని బర్మాభాష ఉచ్చారణతో అన్నాను. ఆమె తనకుడి చేతిని పైకెత్తి నడినెత్తిన పెట్టుకొని, "అవును నాయనా, అనైస, అనైస" అన్నారు (అనిత్య అనే పదాన్ని బర్మా భాషలో "అనైస' అని, పాళి భాషలో 'అనిచ్చ', అని అంటారు - అనువాదకుడు) తరువాత ఆమె తన చేతిని క్రిందకు దించారు. ఆమె నావైపు, డా॥ ఓం ప్రకాష్ గారి వైపు, పూజ్య గురూజీ వైపు, మాతాజి సాయమవైపు చూచి, తరువాత పైవైపుకు చూచి తమ అంతిమ  శ్వాస వదిలారు.

ఇలాంటి మరణదృశ్యం డా॥ ఓం ప్రకాష్ గార్ని చాలా విస్మయ పరిచింది. అప్పుడు తెల్లవారుజామున గం॥ 4-20 ని॥లు అయ్యింది. భారతీయ సాంప్రదాయం ప్రకారం ఆమె శరీరాన్ని మంచం మీద నుండి తీసి నేలమీద పడుకోపెట్టాము. మేము అంతిమ సంస్కారములు చేయడానికి మిగిలిన వారు వచ్చేంత వరకు ఆగాల్సి ఉంది. రంగూన్‌లోని బంధువులు, సమాజంలోని యితరులు గం॥ 8-30 ని॥లకు వస్తారు. అప్పటి వరకు డా॥ ఓం ప్రకాష్ గారితో సహా మేమందరము ప్రక్క నున్న గదిలో ఈ అసాధారణ మరణం గురించే మాట్లాడుకుంటూ ఉన్నాము.

చివరకు మేము స్మశానానికి వెళ్ళవలసిన సమయం (ఉ. గం॥ 8-30 ని॥) అయ్యింది. శవాన్ని పాడెమీద పెట్టే ముందు, స్నానం చేయించి కొత్త బట్టలు తొడగాలి. ఇందుకోసమై ఇలాయిచీదేవి అమ్మగదికి వెళ్ళింది. కాని వెంటనే తిరిగి వచ్చి, అమ్మ ఇంకా బ్రతికే ఉందని చెప్పి మమ్మల్ని ఉలికిపరిచింది. "ఇదేలా సాధ్యం?" అని డా॥ ఓం ప్రకాష్ గారు అన్నారు. ఒక శవములా కాకుండా అమ్మ శరీరము మృదువుగాను, వెచ్చగాను ఉందని ఇలాయిచీ దేవి వివరించారు.

డా॥ ఓం ప్రకాష్ గారితో పాటు మేమంతా అమ్మ దగ్గరకు వెళ్ళాము. అమ్మ పార్థివ శరీరాన్ని జాగ్రత్తగా పరీక్షించి, "అమ్మ జీవించిలేనప్పటికి, ఆమె శరీరము ఇంకా వెచ్చగా ఉన్నమాట నిజమే" అని ఆయన అన్నారు. ఆమె ముఖము అసాధారణమైన ప్రశాంతతతో, దివ్య తేజస్సుతో వెలుగుతోంది. ఆమె గాఢ నిద్రలో ఉన్నట్టుగా ఉంది. అప్పుడు డా॥ ఓం ప్రకాష్ గారు, "ఎంత అసాధారణం!" అన్నారు. ఆమె మరణించింది అనటంలో ఎటువంటి సందేహము లేదు, కాని ఎంత విచిత్రము! నాకు నోటమాట రాలేదు.

మేము అంత్యక్రియలు నిర్వర్తించి ఇంటికి తిరిగి వచ్చాము. కుటుంబములోని అందరూ విపస్సన సాధకులే అయినందున ఎవరూ ఏడవలేదు. ధర్మవాతావరణాన్ని కొనసాగించడానికి నేను చాలా సేపు ధ్యానంలోనే ఉండిపోయాను. సాయంత్రానికల్లా ఒక గంట సామూహిక సాధక కొరకై నగరంలోని విపస్సన ధ్యానులందరూ పోగయ్యారు. పూజ్య గురూజీ సాయాజి, మాతాజి సాయమ కూడా ఉన్నారు. ఆ గంట తరువాత విపస్సన సాధకులు కానివారు కూడా కొంత మంది వచ్చారు. పూజ్య గురూజీ గారి అనుమతితో ఒక గంట ధర్మ ప్రవచనం ఇచ్చాను. అది పూర్తి అయిన వెంటనే డా॥ ఓం ప్రకాష్ గారు నావద్దకు వచ్చి ఒక శిబిరములో పాల్గొనాలనే కోరికను వెలిబుచ్చారు.

ఆయన "తరువాత శిబిరం ఎప్పుడు పెడతారో చెప్పండి," అని అడిగారు. అది సుమారుగా 15 రోజుల తరువాత ఉంది. ఆయనకు తగినంత ముందుగానే తెలియజేస్తానని మాట ఇచ్చాను. మరుసటి రోజు సాయంకాలం కూడా మరొక ధర్మ ప్రవచనం ఇవ్వబడింది. అది పూర్తి అయిన తరువాత డా॥ ఓం ప్రకాష్ గారు నా దగ్గరకు వచ్చి, "తరువాత శిబిరం కొన్ని రోజుల వరకు లేదుకదా, నేను వీలైనంత త్వరగా శిబిరంలో కూర్చోవాలని అనుకొంటున్నాను" అని అన్నారు. పూజ్య గురూజీ ప్రక్కనే ఉన్నారు. డా॥ ఓం ప్రకాష్ గారిలో ఉత్పన్నమైన బలమైన ప్రేరణను చూసి ఆయన వెంటనే ఒక శిబిరం నడపడానికి సన్నద్ధమయ్యారు. ఒకే ఒక వ్యక్తి కోసం పూజ్య గురూజీ ఒక శిబిరం నడపాలనుకోవడం మమ్ములను ఆశ్చర్యచకితులను చేసింది. మరుసటిరోజు డా॥ ఓం ప్రకాష్ గారితో కలసి నన్ను ధ్యాన కేంద్రానికి రమ్మని ఆయన నిర్దేశించారు.

మరుసటిరోజు డా॥ ఓం ప్రకాష్ గారు ధ్యాన కేంద్రానికి ఆయనంతట ఆయనే వచ్చారు. నేను కూడా సకాలంలో చేరుకొన్నాను. శిబిరానికి మరియిద్దరు వచ్చారు. ఆనపాన ఇవ్వడం పూర్తి అయిన తరువాత నేను ఇంటికి తిరిగి వచ్చాను. పూజ్య గురూజీ ఆఫీసుకు వెళ్ళిపోయారు. యధా ప్రకారము ఆయన సాయంకాలము ధ్యాన కేంద్రానికి వచ్చి, తరువాత మా ఇంటికి సామూహిక సాధన కొరకై వచ్చారు. ధర్మ ప్రవచనం పూర్తయిన తరువాత, డా॥ ఓం ప్రకాష్ గారిలో బ్రహ్మాండమైన పురోభివృద్ధి కనిపిస్తూందని పూజ్య గురూజీ నాకు చెప్పారు. నాకు చాలా సంతోషం కలిగింది.

మరుసటి రోజు ఉదయం నన్ను రమ్మని పూజ్య గురూజీ ఇలా కబురు చేశారు. "నీ స్నేహితునిలో పుణ్యపారమితలు పుష్కలంగా ఉన్నాయి. ఆనపాన ఒక్క రోజే చేసిన తరువాత, ఆయన విపస్సనకు సిద్ధంగా ఉన్నారు. వెంటనే రా, ఆయనకు ఇప్పుడే విపస్సన ఇవ్వాలి.' ' నేను డా॥ ఓం ప్రకాష్ గారికి విపస్సన ఇవ్వడానికి ధ్యాన కేంద్రానికి వెళ్ళి, మరల ఇంటికి తిరిగి వచ్చాను. పూజ్య గురూజీ సాయంకాలం ధ్యానానికి, ప్రవచనం ఇవ్వడానికి వచ్చారు. ఒకే ఒకరోజు విపస్సన తరువాత, డా॥ ఓం ప్రకాష్ గారికి "భంగ్" స్థితి వచ్చిందని చెప్పి ఆయన చాలా సంతోషపడ్డారు. డా॥ ఓం ప్రకాష్ గారు చాలా లోతుగా ధ్యానం చేస్తున్నారు.

మరుసటి రోజు ఉదయం పూజ్య గురూజీ నాతో ఫోన్లో ఇలా అన్నారు, "వెంటనే రా. నీ స్నేహితుని అభివృద్ధి చాలా అసాధారణంగా ఉంది. ఆయనకు చాలా జన్మల పారమితలు పుష్కలంగా ఉన్నట్లు కన్పిస్తున్నది. ఆయన నిర్వాణ స్థితికి దగ్గరగా చేరుకొన్నారు. ఆయనకు ఇప్పుడు తగు సూచనలు ఇవ్వాలి." ఆనందాశ్చర్యాలతో ఉక్కిరి బిక్కిరి అవుతూ, నేను ధ్యాన కేంద్రానికి వెళ్ళి, పూజ్య గురూజీ ప్రక్కన కూర్చున్నాను. డా॥ ఓం ప్రకాష్ గార్కి తగు సూచనలు ఇవ్వబడ్డాయి. ఇంద్రియాతీతమైన నిర్వాణ స్థితిని ఆయన వెంటనే పొందగానే, నా ఆనందానికి హద్దులు లేవు. పూజ్య గురూజీ కూడా చాలా సంతోషించారు. ఆయనను జాగ్రత్తగా పరిశీలించి, ఆ లక్షణములను బట్టి అది నిర్వాణ స్థితియే నని ఆయన కనుగొన్నారు. నా ఆనందానికి హద్దు ఏముంటుంది! నా ఆప్త -

మిత్రుడు విముక్తి ప్రవాహంలో చేరి 'శ్రోతాపన్ను'డు (ఆర్యుడు) అయ్యాడు.

డా॥ ఓం ప్రకాష్ గారితో నా మొదటి పరిచయము రెండవ ప్రపంచ యుద్ధము తరువాత 1947లో రంగూన్‌లో జరిగిన ఒక బహిరంగ సమావేశంలో జరిగింది. వెంటనే మేమిరువురము ఒకరి యెడల ఒకరు ఆకర్షితులమయ్యాము. అదృష్టవశాత్తు నేను కలుసుకొన్న స్నేహితులందరూ కూడా మంచివ్యక్తులు. వారందరితోను నా సంబంధాలు ఆత్మీయంగా ఉండేవి. వీరందరిలోకి డా॥ ఓం ప్రకాష్ గారు నాకు అత్యంత సన్నిహితుడు. మేము చాలా రంగాలలో కలిసి పనిచేస్తూ ఉండేవాళ్ళము. యుద్ధానంతరము మేము అఖిల బర్మా హిందీ సాహిత్య సమాజాన్ని పునః స్థాపితం చేసాము మరియు దేశమంతట చాలా చోట్ల దాని శాఖలను తెరిచాము. రంగూన్‌లో ప్రతివారము హిందీసాహిత్యం మీద సదస్సులు నిర్వహించే వాళ్ళము. ప్రాథమిక, మాధ్యమిక మరియు మాధ్యమికానంతర స్థాయి చదువుల కొరకు బర్మా హిందీ సాహిత్యముల పరస్పర మార్పిడి మీద కూడా చాలా కృషి జరిగింది. హిందీ పాఠ్య పుస్తకములు వ్రాయబడి, ప్రచురించబడ్డాయి. భారత బర్మా సాంస్కృతిక కేంద్రము స్థాపించబడి, దాని ద్వారా చాలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ బడ్డాయి. మేమిద్దరము కలసి ఒక అనాథ శరణాలయాన్ని స్థాపించి, దాని నిర్వహణ బాధ్యతలను చేపట్టాము. ఆ విధంగా అనేక ప్రజా సేవా కార్యక్రమములలో కలసి పనిచేసిన తరువాత, ఇప్పుడు మాకు విపస్సన క్షేత్రమునకు అంకితమవడానికి అవకాశం లభించింది. డా॥ ఓం ప్రకాష్ గారు నా పార్శ్వపు తల నొప్పులకు కూడా చికిత్స చేశారు. ఇతర ఔషధాలు పనిచేయడం మానివేసిన తరువాత, ఆయన నాకు మార్ఫిన్ (ఒకరకమైన మత్తు పదార్థము) యింజక్షన్స్ ఇవ్వడం మొదలు పెట్టారు. కాని నేను మార్ఫిన్ మత్తుకు బానిసనైపోతానేమోనని ఆందోళన పడుతూ, ఆయన నన్ను చికిత్స కోసం విదేశాలకు వెళ్ళమని ప్రేరేపించారు. "నీ పార్శ్వపు తలనొప్పులు నయం కాకపోయిననూ, కనీసం మార్ఫిన్ మీద ఆధార పడటం నుండి విముక్తులు అవ్వవచ్చు. ఖచ్చితంగా వేరొక బాధానివారిణి విదేశాలలో దొరకవచ్చు." అని ఆయన చెప్పారు. ఆయన సలహా మేరకు, నేను చికిత్స కొరకు చాలా దేశాలు తిరిగాను, కాని చివరకు నిరాశతో తిరిగి వచ్చాను. డా॥ ఓం ప్రకాష్ గారు కూడా నా బాధలో పాలుపంచుకొన్నారు. తరువాత నేను విపస్సన శిబిరములో చేరి ఈ జబ్బు నుండి విముక్తుడనైన తరువాత ఆయన నా సంతోషంలో పాలుపంచుకొన్నారు.

కాని నేను వరుసగా శిబిరములలో చేరుతూ, రోజు ధ్యానం చేస్తూ, ధ్యాన కేంద్రములో జరిగే సామూహిక సాధనలకు ప్రతి ఆదివారం హాజరవుతున్నప్పుడు, నేను ఒక బౌద్ధుడిగా, ఒక నాస్తికుడుగా మారిపోతానేమో నని ఆయన బాధపడేవారు. ఆయన ప్రేమతో నన్ను మాన్పించేయడానికి తరచుగా ప్రయత్నించేవారు. నేను వారికి ఇలా వివరించేవాడిని, "ఆర్యసమాజము యొక్క లోతైన ప్రభావము కారణంగా, నేను ఏ అంధ విశ్వాసం లోను చిక్కుకుపోను. అనుభవైక సత్యము ఆధారంగా నేను బుద్ధుని బోధనలను నిష్పాక్షికముగా పరీక్షించాను. అది పూర్తిగా దోషరహితంగా ఉందని నేను కనుగొన్నాను. శతాబ్దాలుగా, తప్పుడు భావనలు మచ్చలేని బుద్ధుడి బోధనలను వదిలి వేసేటట్లుగా భారతీయులను నడిపించాయి. స్వయంగా నేను కూడా ఈ అసత్య ప్రచారానికి బలి అయిన వాడినే. కాని ఇప్పుడు అనుభవం ద్వారా నేను ఆయన బోధనలలో లేశ మాత్రమైనా కళంకం లేదని గ్రహించాను. ఇంతటి స్వచ్ఛమైన అమూల్యమైన విద్య తన పుట్టినిల్లైన భారత దేశము నుండే లుప్తమవటం నాకు చాలా వింతగా ఉంది." నా మాటలు ఆయన మీద ఎలాంటి ప్రభావం చూపించాయో తెలియదు కాని, నా తల్లి మరణానంతరం ఆయనలోని అపార పారమితలు మేల్కొన్నాయి. ఆయన ఈ విద్యకు శాశ్వతంగా అంకితమయ్యారు.

నేను ఇండియాకు 1969లో వచ్చిన తరువాత విపస్సన శిబిరాలు నిర్వహించడం మొదలైంది. కాని డా॥ ఓం ప్రకాష్ గారు మయన్మార్ (బర్మా)లోనే ఉండిపోయారు. కొన్ని అత్యంత బాధాకరమైన పరిస్థితులు అనుభవించినపుడు కూడా, ఆయన మనస్సులో కఠినత్వము లేశమైనా లేదు. కొందరి అధికారుల దుష్ప్రవర్తనను కళాశాలలో తన సహాధ్యాయియే అయిన ఆ దేశపు అధ్యక్షునకు కనీసము తెలియపరచలేదు. ఆయన మనసు ఎల్లప్పుడు మైత్రితోను సమతతోను నిండి ఉండేది. విపస్సన ఆయన రక్షణ కవచం. అంతకు ముందు కూడా ఆయన స్వభావం శాంతంగా స్థిరంగా ఉండేది. ఇప్పుడు విపస్సన దానిని మరింత బలపరచింది. కొన్ని సంవత్సరముల తరువాత ఆయన భారత దేశానికి వచ్చి విపస్సన కార్యక్రమాలలో నిమగ్నమైనారు.

ఆయన మయన్మార్‌లో పేరెన్నికగన్న వైద్యులలో ఒకరు, కాని వారి సాధుస్వభావము కారణముగా వైద్యమును కూడా సేవా భావంతోనే చేసేవారు. ఆయన ఫీజ్ ఇంత అని నిర్ధారణ చేయలేదు. ఆరోగ్యము తిరిగి పొందిన తరువాత, రోగులు ఏమిస్తే దానిని సంతోషంగా స్వీకరించేవారు. చాలామంది పేదరోగుల నుండి ఆయన ఏమి తీసుకొనేవారు కాదు. పైపెచ్చు కొందరికి తానే మందులు ఉచితంగా ఇచ్చేవారు. అది ఆయన సహజ స్వభావము. భారత దేశమునకు వచ్చిన తరువాత ఆయన ఢిల్లీలో ఉన్నప్పుడల్లా, ఆర్య సమాజంలోని ఉచిత వైద్యశాలలో క్రమంతప్పకుండా రెండు గంటలు సేవచేసేవారు. మిగిలిన సమయమును విపస్సన సేవకే వినియోగించేవారు. 87 సం॥ వయస్సులో కూడా ఆయన చాలా ప్రదేశములకు ప్రయాణించి తనకంటే చిన్నవారైన చాలామంది కంటే ఇనుమడించిన ఉత్సాహంతో శిబిరములు నిర్వహించారు. చాలాసార్లు ఆయన విదేశాలకు కూడా వెళ్ళారు.

ఇటీవలనే, ఆయన చాలా శిబిరములు నిర్వహించుటకు అమెరికా వెళ్ళారు. యాత్రలో భాగంగా ఆయన లాస్ ఏంజలిస్, కన్‌సాస్ నగరములకు వెళ్ళి, తరువాత 'ధమ్మకుంజ' (సియాటిల్ దగ్గర) మరియు 'ధమ్మసిరి' (డల్లాస్ దగ్గర) లో శిబిరములు నిర్వహించాల్సి ఉంది. లాస్ ఏంజలిస్‌లో ఉన్నప్పుడు ఆయనకు గుండె నొప్పి వచ్చింది. ఆసుపత్రికి తీసుకొని వెళ్ళిన తరువాత ఆయన తన పరిస్థితిని వైద్యులకు పూర్తి స్పష్టతతో వివరించారు. అలా చేస్తూనే అపస్మారక స్థితి (కోమా)లోకి వెళ్ళారు. ఆయన ఆ స్థితిలో ఇంటెన్సివ్ కేర్ వార్డ్‌లో కొన్ని రోజులు ఉన్నారు. అదే సమయములో నేను ఆగ్నేయాసియా దేశములలో ధర్మపర్యటనలో ఉన్నాను. నేను సింగపూర్ చేరుకోగానే నాకు ఆయన అనారోగ్యపు వార్త అందినది. నేను ఫోన్ చేసి మైత్రి ఇచ్చాను. కాని ఆయనతోపాటు ఉన్న ఆయన

అల్లుడైన డా॥ సోనిగారు మైత్రీ యొక్క ప్రభావము కన్పించినట్టు భౌతిక లక్షణములేవి లేవని చెప్పారు. ఆయన ఇలా అన్నారు, "ఆయన మెదడు అసలు పనిచేయడం లేదు, కావున జ్ఞానేంద్రియాలేవి పనిచేయుటలేదు." ఇది వినగానే నాకు విచారం కలిగింది. కాని ఆయన మరణమునకు కొన్ని నిమిషముల ముందు, వినికిడి జ్ఞానమును తిరిగి పొందినట్లు అనిపించింది. దోహా మరియు ధర్మ ప్రవచనముల కేసెట్లు నిరంతరముగా ఆయనకు దగ్గరగా పెట్టారు. అంత్య సమయంలో ఆయన కళ్ళు కొంచెం తెరుచుకొన్నట్లు, పెదవులు కొంచెం కదలినట్లు, ఆయన దేనినో చూస్తున్నట్లు అనిపించిందని ఆయన కుమారుడైన డా॥ రాజీవ్ చెప్పారు. తరువాత ఆయన శ్వాస మందగిస్తూ వచ్చింది, ఒక నిమిషమునకు 9 శ్వాసలే. ఆయన శ్వాసక్రియ క్రమక్రమంగా మందగించి చివరకు ఆయన ప్రశాంతంగా అంతిమశ్వాస విడిచారు. ఆయన ముఖము దివ్య తేజస్సుతో వెలుగుతోంది. దీనిని బట్టి ఆయన అంతఃచేతన బాగానే ఉన్నట్లు, కాని ఆయన కావాలనుకొన్నప్పటికిని భౌతిక కదలికలు చేయలేకపోయారని మనం నిర్ణయానికి రావచ్చు. చివరిలో ఆయన ధర్మబలము పైకి వచ్చి, ఆయన కళ్ళు తెరుచుకొన్నాయి మరియు పెదవులు కదిలినవి. ఆయన అంతఃచేతన మేల్కొని ఉన్నదనడానికి ఇదే ఋజువు.

ఏడు దేశముల దీర్ఘ ధర్మయాత్ర తరువాత నేను ముంబయి నగరం తిరిగి వచ్చినపుడు, నాకు వచ్చిన ఉత్తరముల కట్టలలో ఆగష్టు 26న ఆయన వ్రాసిన ఉత్తరము కూడా ఉంది. దాంట్లో ఆయన లాస్ ఏంజలిస్ వరకు జరిగిన ప్రయాణము గురించి వివరించి భవిష్యత్ శిబిరముల వివరములు వ్రాసి, మైత్రి ఇమ్మని అడిగారు. ఆయన ధర్మసేవ చాలా ఫలవంతముగా ఉండెడిది. ఆయనచే శిబిరములు నిర్వహించుకోవాలని చాలా కేంద్రములు ఆతృతగా ఉండేవి. అమెరికాలో కూడా చాలా మంది ఆయన కొరకు ఉత్సుకతతో ఎదురు చూసేవారు. కాని ఆయన ప్రయాణం మధ్యలో ఆగిపోయి, పెద్ద ఉన్నతిని పొందారు. సాధకులు నిరీక్షిస్తూనే ఉన్నారు. ఆయన ఉత్తరం చదివిన తరువాత నేను ఒక నిట్టూర్పు విడిచాను. నానుండి అప్రయత్నముగా ఈ క్రింది మాటలు వచ్చాయి.

**బడే గౌర్‌సే సున్ రహాథా జమానా,**
**తుమ్‌హీ సోగయే దాస్తాం కహతే కహతే ।**
వింటూ ఉండింది ప్రపంచం చాలా శ్రద్ధగా
కాని నిద్రలోకి జారుకున్నావు కథ చెపుతూ చెపుతూ!

రోజు రోజుకీ విశ్వ విపస్యనా కుటుంబం పెరుగుతూంది, కాని నా ధర్మ సోదరుల సంఖ్యాబలం తగ్గిపోతున్నది. సాయాజీ ఊ బా ఖిన్ గారి నుండి ప్రత్యక్షముగా విద్య నేర్చుకొన్నవారు ఇప్పుడెంత మంది ఉన్నారు? ఈ ధర్మ సోదరుడు కూడా తన పనిని పూర్తి చేశారు. "అంత్ సమయ్‌తక్ ధర్మ్‌కి సేవా హోతీజాయ్" – నా ఆఖరి క్షణం వరకు నేను ధర్మమునకు సేవ చేయుదును గాక!"

ఇలాంటి ధర్మసోదరుడు లభించినందుకు నేను చాలా అదృష్టవంతుడిని. విపశ్యన సాధకులకు, ఆచార్యులకు డా॥ ఓం ప్రకాష్ గారు నిర్దేశించిన ధ్యేయము భావితరాలకు ఒక సంకేతదీపముగా పనిచేస్తుంది. ఈ ప్రేరణ చాలామందికి కళ్యాణకారిణి అవుతుంది, ఆనందదాయిని అవుతుంది. భారతదేశము తనపురాతన వైభవాన్ని, ఔన్నత్యాన్ని తిరిగి పొంది ప్రపంచానికి అనంత కళ్యాణకారిణి అవుతుంది.

కల్యాణమిత్ర
**సత్యనారాయణ గోయెంకా**

### "అపూర్వ శీతల శాంతి"

నేనొకసారి ఉత్తర భారతదేశపు ధర్మయాత్రలో ఉన్నపుడు, డాక్టర్ ఓం ప్రకాష్ గారింట్లో రెండు రోజులు ఉన్నాను. ఆయన తన పడక గది మాకు ఇచ్చి, వేరొక రూమ్‌లో పడుకొన్నారు. మేము అక్కడికి వెళ్ళిన మరుసటి ఉదయం ఆయనతో కలసి నేను ఆయన పడక గదిలో ధ్యానం చేసాను. ఒక గంట ధ్యానము చివరిలో, ఆయన నుండి ఒక్కసారిగా అద్వితీయమైన నిర్వాణ శీతల ప్రశాంతత ఉద్భవించి గది అంతా పరచుకొంది. ధ్యానము పూర్తి అయిన తరువాత ఆయన చాలా నమ్రతతో ఇలా అన్నారు. "ఈరోజు మీతో ధ్యానము చేసి నేను ధన్యుడినయ్యాను. నేను పోల్చలేని ఆహ్లాదకరమైన అపూర్వ ప్రశాంతతను అనుభవించాను" నేను ఇలా అన్నాను, "మీ అనుభవం గురించి మీకే బాగా తెలుసు. కాని మీ నిర్వాణ శీతల ప్రశాంతతను అనుభవించి నేను నిజంగా ధన్యుడినయ్యాను."

–సత్యనారాయణ గోయెంకా


**తెలుగు పత్రిక సంవత్సరపుచందా పూర్తి అయిన సాధకులు రూ. 50 ఈ క్రింది చిరునామాకు పంపి పత్రికను పొందగలరు.**
**విపశ్యన తెలుగు మాసపత్రిక,**
**విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070. ఫోన్ : 24241746 (ఆశ్రమం).**
***(ఆఫీసు పనిచేయు వేళలు : ఉదయం 9 గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు)***


BOOK POST

**PRINTED MATTER**

TO

If Underlivered please return to:
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
Nagarjuna Sagar Road, Vanasthalipuram,
HYDERABAD - 500 070.


Published for Vipassana International Meditation Centre, Sahebnagar, Nagarjuna Sagar Road, Vanasthalipuram, Hyd. (A.P) -70. Ph : 040-24240290. Published by Smt. Sabrina Katakam. Editor & Printer : Sri O. Premanand. Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 23325979. RNI No. APTEL 08618/01/2004-TC